సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
గురువారం : 4 : మే : 2023



చీనీ టన్ను రూ.37 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.37 వేలు పలికాయి. మార్కెట్‌కు 375 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.5

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.5. కనిష్టంగా రూ.3. సరాసరిన రూ.4 ప్రకారం పలికినట్లు అధికారులు తెలిపారు.

గరిష్ఠం/కనిష్ఠం
37.4°/21.6°

జిల్లాలో బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా వర్షం కురిసింది. వాయువ్య దిశగా గంటకు 8 నుంచి 12 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

భూసేకరణ వేగవంతం చేయాలి

- జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్



మాట్లాడుతున్న జేసీ టీఎస్ చేతన్

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో వివిధ రహదారుల ఏర్పాటు కోసం భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో భూ సేకరణ అంశంపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, జిల్లాలో ఏర్పాటవుతున్న గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేతో పాటు ఎన్‌హెచ్ 342, ఎన్‌హెచ్ 716జీ, కదిరి బైపాస్, కొలేపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి మీదుగా నిర్మించే రహదారులకు సంబంధించిన భూ సేకరణను వేగవంతం చేయాలన్నారు. ఎక్కడైనా సమస్యలుంటే వెంటనే పరిష్కరించాలన్నారు. దీనిపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో పుట్టపర్తి, కదిరి ఆర్డీఓలు భాగ్యరేఖ, రాఘవేంద్ర, కలెక్టరేట్ జీసెక్షన్ సూపరింటెండెంట్ బాలాజీ, నేషనల్ హైవే ఈఈ మధుసూదన్, డీఈ గిడ్డయ్య, ఆయా మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఫార్మా డీ, ఎంబీఏ ఫలితాల విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో నిర్వహించిన ఫార్మా డీ నాలుగు, ఐదో సంవత్సరం (ఆర్–17) రెగ్యులర్, సప్లిమెంటరీ, ఎంబీఏ రెండు, నాలుగో సెమిస్టర్ (ఆర్–17) సప్లిమెంటరీ, ఎమ్మెస్సీ మూడో సెమిస్టర్ (ఆర్–21) రెగ్యులర్ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఇ.కేశవరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ బి.చంద్రమోహన్‌రెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. ఫలితాలు జేఎన్‌టీయూ అనంతపురం వెబ్‌సైట్‌లో ఉంచినట్లు వెల్లడించారు.

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



భక్తుల నడుమ ఉత్సవ మూర్తుల ఊరేగింపు

ఉరవకొండ: పెన్నహోబిలం లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు బుధవారం ధ్వజారోహణంతో అంకురార్పణ చేశారు. తొలుత ఆలయంలో మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తుల నడుమ ఆలయ ప్రధాన అర్చకులు ద్వారకనాథాచార్యులు, బాలాజీస్వామి, ఈఓ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ గరుడపటాన్ని ఉత్సవమూర్తుల సాక్షిగా ధ్వజస్తంభంపై శాస్త్రోక్తంగా ఎగురవేశారు. మహావిష్ణువుకు అత్యంత ప్రీతిపాత్రుడైన గరుత్మంతుడి పటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి తిరుకల్యాణోత్సవం, బ్రహ్మోత్సవాలకు సంకేతంగా అటు సకలదేవతలకు, ఇటు మానవజాతికి తెలిసేలా ధ్వజారోహణం ఘనంగా జరిపారు. అనంతరం భూదేవి, శ్రీదేవి సమేత నారసింహున్ని పుర వీధుల్లో వైభవంగా ఊరేగించారు.

ఆకట్టుకున్న రాతిదూలం లాగుడు పోటీలు



రాతిదూలం లాగుడు పోటీలను ప్రారంభిస్తున్న సీఐ చిన్నగౌస్

రామగిరి: గరిమేకలపల్లి వీరఓబమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాతిదూలం లాగుడు పోటీలను నిర్వహించారు. సీఐ చిన్నగౌస్ పోటీలను ప్రారంభించగా మొత్తం 8 జతల ఎద్దులు పాల్గొన్నాయి. తోపుదుర్తి చెన్నప్పకు చెందిన ఎద్దులు ప్రథమ స్థానంలో నిలిచాయి. గంగవరం గురుయాదవ్, గార్లదిన్నె పరమేష్ ఎద్దులు తర్వాతి స్థానాల్లో నిలిచాయి. వరుసగా రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు నగదు బహుమతులను అందించారు. జాతరకు ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా కర్ణాటక నుంచి తరలివచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సిద్దన్న, ఎంపీటీసీ రామ్మోహన్‌తో పాటు కులపెద్దలు గోపాలప్ప, ఆదినారాయణ, శివ, కేశవప్ప, రాజప్ప, మురళి, గంగప్ప, తిప్పన్న, గోపాల్ పాల్గొన్నారు.

బాద్‌షా.. బేనీషా



మామిడి పేరు చెప్పగానే వెంటనే గుర్తొచ్చేది బేనీషానే. రంగుతో పాటు సువాసనలు వెదజల్లుతూ రుచికరంగా ఉండే ఈ పండ్లకు దేశవ్యాప్తంగా డిమాండ్ ఉంది. జిల్లాలో పండే మామిడి రకాల్లో బేనీషాదే అగ్రస్థానం కాగా, ప్రస్తుతం టన్ను రూ.30 వేలకు పైగా పలుకుతోంది. దీంతో మామిడి రైతు ఇంట లాభాల పంట పండుతోంది.



కప్పలబండ వద్ద విరగ్గాసిన మామిడి చెట్టు



మార్కెట్‌కు తరలించేందుకు పండ్లను ట్రేలలో ప్యాక్ చేస్తున్న దృశ్యం

రూ.కోట్లు కురిపిస్తున్న మామిడి

- జిల్లాలో పండే బేనీషాకు ఫుల్ డిమాండ్
- దేశంలోని పలు నగరాలకు ఎగుమతి
- పెరిగిన ధరలతో రైతన్న ఇంట లాభాల సంబరం

నియోజకవర్గం	హెక్టార్లు
పుట్టపర్తి	6,950
ధర్మవరం	4,800
కదిరి	4,500
హిందూపురం	2,600
పెనుకొండ	1,800
మడకశిర	900
రాప్తాడు (మూడు మండలాలు)	700

22,250 జిల్లాలో మామిడి తోటల విస్తీర్ణం (హెక్టార్లు)

15,000 ప్రస్తుతం కోతకు వచ్చినవి తోటలు (హెక్టార్లు)

8 టన్నులు హెక్టారుకు దిగుబడి

రూ. 30 వేలు మార్కెట్‌లో టన్ను బేనీషా ధర

1.20 లక్షల టన్నులు ఈ ఏడాది జిల్లాలో దిగుబడులు

రూ. 360 కోట్లు ఈ ఏడాది మామిడి టర్నోవర్

పుట్టపర్తి అర్బన్: మామిడి రైతుల పంట పండింది. ఈ ఏడాది దిగుబడి పెరగడంతో పాటు ధర కూడా ఆశించిన స్థాయిలో ఉండటంతో రైతులు ఆనంద పడుతున్నారు. జిల్లాలో బేనీషా, బెంగళూరు, మల్లిక, ఖాదర్, అల్ఫాన్సో, కేసర్ రకాల మామిడి సాగులో ఉండగా, బేనీషా రకం 95 శాతం విస్తరించి ఉంది. జిల్లాలో పండే బేనీషా రకానికి మంచి డిమాండ్ ఉండటంతో మన మామిడి దేశంలోని వివిధ రాష్ట్రాలకు ఎగుమతి అవుతోంది.

ఈ ఏడాది 1.20 లక్షల టన్నుల దిగుబడి..

జిల్లాలో 22,250 హెక్టార్లలో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. ప్రస్తుతం కాయలు కాసి కోతకు వచ్చిన తోటలు సుమారు 11 వేల హెక్టార్లు ఉన్నాయి. ఇక ఐదేళ్ల పూర్తయి ఇప్పుడిప్పుడే కాత నిలిపిన తోటలు 6 వేల హెక్టార్లు ఉన్నాయి. ఈ ఏడాది హెక్టారుకు సరాసరిన 8 టన్నుల మేర దిగుబడి వచ్చింది. ఈ లెక్కన మొత్తం 1.20 లక్షల టన్నుల దిగుబడి రావొచ్చని అధికారులు అంచనా వేశారు. టన్ను బేనీషా మార్కెట్‌లో రూ.30 వేలకు పైగా ఉండగా, రూ.360 కోట్ల టర్నోవర్ జరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

పెరిగిన దిగుబడి..

గత ఏడాది హెక్టారుకు 6 టన్నుల దిగుబడి రాగా, ఈ సారి 8 నుంచి 10 టన్నుల దిగుబడి వస్తోంది. కాయ నాణ్యంగా ఉండటంతో బుక్కపట్నం మండలానికి చెందిన వ్యాపారులు తోటలపైనే పంట కొంటున్నారు. కాయను శుభ్రం చేసి ప్యాకింగ్ చేసి ఎగుమతి చేస్తున్నారు. బేనీషా టన్ను రూ.30 వేలకుపైగా పలుకుతుండగా, అల్ఫాన్సో, కేసరి రకాలు టన్ను రూ.70 వేలకుపైగా ధర పలుకుతున్నాయి.

ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు..

జిల్లాలో పండే మామిడికి ఇతర రాష్ట్రాల మార్కెట్‌లో మంచి ధర లభిస్తోంది. దీంతో వ్యాపారులు దేశంలోని పలు రాష్ట్రాల మార్కెట్లకు మామిడిని ఎగుమతి చేస్తున్నారు. బేనీషా రకం మామిడిని ఢిల్లీ, బెంగళూరు, నాగపూర్, మహారాష్ట్ర, రాజస్థాన్, మధ్యప్రదేశ్, హైదరాబాద్, కేరళ రాష్ట్రాలకు అత్యధికంగా ఎగుమతి చేస్తున్నారు.

దిగుబడి పెరిగింది



గత ఏడాదితో పోలిస్తే ఈ సారి మామిడి దిగుబడి పెరిగింది. నీటి వసతి ఉండటంతో పంటను కాపాడుకోగలిగాం. కాయ మంచి సైజు రావడంతో వ్యాపారులు తోట వద్దే కొనుగోలు చేసి మార్కెట్‌కు తరలిస్తున్నారు. బేనీషా టన్ను రూ.30 వేల వరకూ ధర పలుకుతోంది.

– ఓబిరెడ్డి, రైతు, బుక్కపట్నం

గిట్టుబాటు అవుతోంది



ఈసారి మామిడికి గిట్టుబాటు ధర లభిస్తోంది. పచ్చి కాయలే అధికంగా అమ్ముడుపోతున్నాయి. కాయలు కోసిన తర్వాత ఎలాంటి మందులు వేయకుండా సహజ పద్ధతుల్లో మాగబెట్టడంతో రుచి బాగా ఉంటున్నాయి. అందుకే జిల్లాలో పండిన మామిడికి మంచి ధర లభిస్తోంది.

– నరసింహులు, రైతు, కప్పలబండ

గ్రేడింగ్‌తో అధిక ధర



మామిడి పండ్లను గ్రేడింగ్ చేసుకుంటే మంచి ధర లభిస్తుంది. నాణ్యమైన కాయలు మంచి సైజులో ఉంటే కొనేందుకు వ్యాపారులు ముందుకు వస్తారు. పోటీ పెరిగి అధిక ధర లభిస్తుంది. ఈ ఏడాది జిల్లాలో మామిడి దిగుబడి కూడా పెరగడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– చంద్రశేఖర్, జిల్లా ఉద్యానశాఖ అధికారి

6న ట్రాక్టర్ నగర్‌లో కృషి దర్శన్ ఎక్స్‌పో

గార్లదిన్నె: మండల పరిధిలోని దక్షిణ వ్యవసాయ క్షేత్ర వ్యవసాయ యంత్రాల శిక్షణ పరీక్షణ సంస్థ (ట్రాక్టర్ నగర్)లో ఈ నెల ఆరో తేదీన కృషి దర్శన్ ఎక్స్‌పో – 2023 నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ డైరెక్టర్ కమలాబాయి పేర్కొన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిన సందర్భంగా 'కృషి దర్శన్' కార్యక్రమం ద్వారా వివిధ రాష్ట్రాల నుంచి తయారు చేసిన ఆధునిక యంత్రాలు, పరికరాలను, చిరుధాన్యాలు ప్రాసెసింగ్ చేసే యంత్రాలను కంపెనీ ప్రతినిధులు ప్రదర్శిస్తారన్నారు. వివిధ ప్రాంతాల నుంచి ప్రదర్శనకు వచ్చే రైతులకు ఉచిత రవాణా సౌకర్యం, భోజన సదుపాయం ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, కలెక్టర్ గౌతమి ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు.

ప్రత్యేకాధికారులను నియమించాలి

పుట్టపర్తి అర్బన్: మండలానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించి జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి చూపించాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. బుధవారం ఉదయం ఆయన తన క్యాంపు కార్యాలయం నుంచి హౌసింగ్, స్పందన, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు తదితర అంశాలపై జేసీ టీఎస్ చేతన్, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, డీఆర్‌ఓ కొండయ్య, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, ఆర్డీఓలు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మండలాన్ని మూడు జోన్లగా విభజించి తహసీల్దార్, ఎంపీడీఓ, హౌసింగ్ ఏఈలకు జగనన్న లేఅవుట్లు, లబ్ధిదారులను కొంతమందిని కేటాయించినట్లు చెప్పారు. వీటిపై పర్యవేక్షణకు మండల ప్రత్యేకాధికారులను నియమించనున్నట్లు వెల్లడించారు. రెండు నెలల్లోపు ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి కనిపించాలన్నారు. స్పందనకు సంబంధించి 11 రీ ఓపెన్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే పరిష్కరించాలన్నారు. రీసర్వేలో ఎంపిక చేసిన గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్ త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆధార్ అప్‌డేట్‌పై దృష్టి సారించాలన్నారు. 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో మంజూరైన పనులను పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని ఆదేశించారు.

సరిహద్దులో భద్రత కట్టుదిట్టం

- 18 చెక్‌పోస్టుల ఏర్పాటు.. సిబ్బంది నియామకం
- ఎస్పీ మాధవరెడ్డి వెల్లడి



హిందూపురం చెక్‌పోస్టు వద్ద సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ మాధవ రెడ్డి

కొత్తచెరువు: కర్ణాటక ఎన్నికల నేపథ్యంలో జిల్లా సరిహద్దులో భద్రత కట్టుదిట్టం చేసినట్లు ఎస్పీ ఎస్.వి.మాధవరెడ్డి తెలిపారు. జిల్లా సరిహద్దులోని 16 పోలీస్ స్టేషన్‌ల పరిధిలో 18 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. ప్రతి చెక్‌పోస్టులో ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లు, 8 మంది కానిస్టేబుళ్లు నియమించామన్నారు. వీరితో పాటు అదనంగా 5 మొబైల్ పార్టీలు ఏర్పాటు చేశామని, వీరు సరిహద్దు ప్రాంతాల్లో నిరంతరం తిరుగుతూ ఉంటారన్నారు. కర్ణాటక రాష్ట్రంలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూసేందుకు ఆ రాష్ట్ర పోలీసులతో కలిసి సమన్వయంతో పనిచేస్తామన్నారు. మంగళవారం రాత్రి ఆయన పరిగి మండలంలోని మోదా, హిందూపురం మండలంలోని తూముకుంట, లేపాక్షి మండలంలోని కంచిసముద్రం చెక్ పోస్టు, చిలమత్తూరు మండలంలోని కొడికొండ చెక్ పోస్టులను పరిశీలించి సిబ్బంది సూచనలిచ్చారు.

మెరుగైన వైద్యసేవలందించాలి

- వైద్యులు అందుబాటులో ఉండాలి
- పీహెచ్‌సీల తనిఖీలో కలెక్టర్ అరుణ్‌బాబు



ఓడీసీ ఆస్పత్రిలో గదులను పరిశీలిస్తున్న కలెక్టర్

అమడగూరు/ఓడీ చెరువు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. బుధవారం ఆయన అమడగూరు, ఓడీ చెరువు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా ఆస్పత్రుల్లోని అన్ని గదులనూ క్షుణ్ణంగా పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. సిబ్బంది సంఖ్య, మందుల నిల్వ గురించి అడిగి తెలుసుకున్నారు. తొలుత అమడగూరు వెళ్లిన కలెక్టర్... పీహెచ్‌సీ పరిధిలోని గర్భిణులు, బాలింతలు వివరాలను వైద్యాధికారి మోనాను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలోనే ప్రసవాలు అయ్యే విధంగా చూడాలని, మాతా, శిశు మరణాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని సక్రమంగా అమలు చేస్తూ ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. అనంతరం కలెక్టర్ కసముద్రం గ్రామ సచివాలయాలన్ని సందర్శించారు. రికార్డులు పరిశీలించి సిబ్బంది వివరాలు ఆరా తీశారు. సచివాలయానికి వచ్చే గ్రామస్తులతో మర్యాదగా మసలుకుంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రెడ్డిశేఖర్, ఎంపీడీఓ నసీమా, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి

అనంతరం ఓడీ చెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లిన కలెక్టర్.. వైద్యులు, సిబ్బంది వివరాలను సీహెచ్‌ఓ సుభాషిణిని అడిగి తెలుసుకున్నారు. వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఆరా తీశారు. మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఐనుద్దీన్‌ఖాన్ అడిషనల్ డీఎంహెచ్‌ఓ బాధ్యతలతో కదిరి ఆస్పత్రిలో ఉన్నారని, మరో వైద్యుడు భానుప్రకాష్‌నాయక్ 104 సేవల కోసం డబురువారిపల్లికి వెళ్లినట్లు సిబ్బంది తెలిపారు. అనంతరం కలెక్టర్... ఓపీ వివరాల రికార్డును పరిశీలించారు. పీహెచ్‌సీలో ఒక వైద్యుడు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ మహమ్మదాబాద్ క్రాస్‌లోని అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లారు. పిల్లలను 10 నిమిషాలు ముందే ఇంటికి పంపించినట్లు గుర్తించి సిబ్బందిని ప్రశ్నించారు. మరోసారి అలా చేయకూడదని హెచ్చరించారు.



లక్ష్మీ చెన్నకేశవస్వామి రథాన్ని లాగుతున్న భక్తులు (ఇన్‌సెట్) రథంపై కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ చెన్నకేశవస్వామి

రమణీయం.. రథోత్సవం





గజవాహనంపై ఊరేగుతున్న లక్ష్మీచెన్నకేశవస్వామి, మడుగుతేరును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి దంపతులు

- గోవింద నామస్మరణతో ప్రతిధ్వనించిన ధర్మవరం
- కనుల పండువగా సాగిన లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మరథోత్సవం
- భక్తులతో కలిసి రథాన్ని లాగిన ఎమ్మెల్యే కేతిరెడ్డి

ధర్మవరం అర్బన్: గోవిందనామ స్మరణతో ధర్మవరం మార్మోగింది. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తజనంతో తేరుబజార్ పోటెత్తింది. లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 11వ రోజు బుధవారం బ్రహ్మరథోత్సవం కమనీయంగా సాగింది. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచే కాకుండా వైఎస్సార్, కర్నూలు, చిత్తూరు జిల్లాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీచెన్నకేశవస్వామిని దర్శించుకుని తరించారు.


మడుగుతేరుతో ప్రారంభం..

ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవ విగ్రహాలను గజ వాహనంపై పురవీధులలో ఊరేగింపుగా తేరుబజార్‌కు తీసుకువచ్చారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన రథంపైన స్వామి, అమ్మవార్లను కొలువుదీర్చారు. ఉదయం 7 గంటలకు మడుగుతేరు నిర్వహించగా, ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, సుప్రియ దంపతులు పూజలు చేసి తేరు లాగారు. అనంతరం వేలాది మంది భక్తులు రథం వద్దకు చేరుకుని టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

కిటకిటలాడిన ధర్మవరం..

సాయంత్రం 4 గంటలకు బ్రహ్మ రథోత్సవం ప్రారంభం కాగా, ఈ కమనీయ దృశ్యాన్ని చూసేందుకు భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. దీంతో పట్టణం భక్తులతో కిటకిటలాడింది. తేరుబజార్ నుంచి ప్రారంభమైన రథోత్సవం భక్తుల గోవిందనామ స్మరణల మధ్య అంజుమన్ సర్కిల్ వరకు సాగింది. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి రథాన్ని లాగుతూ భక్తుల్లో ఉత్సాహం నింపారు. సీఐలు సుబ్రహ్మణ్యం, రాజా ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సాయంత్రం 6 గంటలకు ధూళోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దాసెట్టి సుబ్రహ్మణ్యం, ప్రధాన అర్చకులు కోనేరాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

రేపు అనంతపురానికి మంత్రి విడదల రజని



అనంతపురం అర్బన్: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని ఈ నెల 5న అనంతపురం విచ్చేస్తున్నారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు కర్నూలు నుంచి బయలుదేరి రోడ్డు మార్గంలో 11.30 గంటలకు అనంతపురం ప్రభుత్వసర్వజనాస్పత్రికి చేరుకుంటారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆస్పత్రిలో అన్ని విభాగాలనూ సందర్శిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రెండు గంటల వరకు వైద్య కళాశాల ప్రొఫెసర్లు, విభాగాల అధిపతులతో సమావేశమవుతారు. మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు భోజన విరామం తీసుకుంటారు. మధ్యాహ్నం 3 గంటలకు అనంతపురం నుంచి బయల్దేరి రోడ్డు మార్గంలో బెంగళూరుకు వెళతారు. అక్కడి నుంచి విమానంలో గన్నవరం వెళతారని అధికార యంత్రాంగం తెలిపింది.

37 మందికి ఉద్యోగావకాశాలు



ఉద్యోగాలకు ఎంపికైన వారితో ఎస్కేయూ రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య, తదితరులు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో బుధవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 37 మంది విద్యార్థులకు ఉద్యోగావకాశాలు దక్కాయి. ఈ మేరకు ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ కె.అనిత తెలిపారు. చైతన్య గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలకు హాజరైన విద్యార్థుల్లో తొలి రౌండ్‌లో 88 మంది ఉత్తీర్ణులు కాగా, బుధవారం నిర్వహించిన ఇంటర్వ్యూలకు 56 మంది హాజరయ్యారు. ఇందులో ప్రతిభ కనబరిచిన 37 మందికి ఆకర్షణీయమైన ప్యాకేజీతో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కంపెనీ నిర్వాహకులు ఉత్తర్వులు అందజేశారు. ప్రతిభ చాటుకున్న విద్యార్థులను వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఎంవీ లక్ష్మయ్య, ప్రిన్సిపాళ్లు ప్రొఫెసర్ కృష్ణకుమారి, ప్రొఫెసర్ బాలసుబ్రహ్మణ్యం అభినందించారు.

డిజీ లాకర్.. తగ్గిన వ్యయం

- జేఎన్‌టీయూ (ఏ)లో తొలిసారి డిజీ లాకర్‌లోకి జవాబు పత్రాలు
- విద్యార్థులకు అందుబాటులో డిజిటల్ మార్క్స్‌కార్డులు
- నేరుగా ప్రొవిజనల్ సర్టిఫికెట్ తీసుకునే వీలు
- ప్రతి సెమిస్టర్‌కు సర్టిఫికెట్ ప్రింటింగ్ వ్యయం ఆదా



జేఎన్‌టీయూ (ఏ)లోని పరీక్షల విభాగం

అనంతపురం: సుదూర ప్రాంతాల విద్యార్థుల సౌకర్యార్థం జేఎన్‌టీయూ (ఏ) మెరుగైన చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో డిజీ లాకర్‌లో సెమిస్టర్ మార్క్స్‌కార్డులు అందుబాటులోకి తీసుకువచ్చింది. విద్యార్థులు తమకు అవసరమైన సర్టిఫికెట్లు ఎప్పుడైనా... ఎక్కడి నుంచైనా డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు కల్పించింది. దీంతో సెమిస్టర్ ప్రాతిపదికన హార్డ్ కాపీ ధ్రువీకరణ పత్రాల అవసరం లేకుండా పోయింది. దీంతో జేఎన్‌టీయూ (ఏ)కు ఏటా రూ.1.50 కోట్ల మేర ఆదా అవుతోంది.

సర్టిఫికెట్లకు భద్రత..

ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేసే డిజీ లాకర్ విధానంతో నిర్వహణ వ్యయం తగ్గడంతో పాటు సర్టిఫికెట్లకు భద్రత ఏర్పడింది. జేఎన్‌టీయూ (ఏ) పరిధిలో రాయలసీమ జిల్లాలతో పాటు నెల్లూరు జిల్లాలో మొత్తం 1.10 లక్షల మంది విద్యార్థులు ఇంజినీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ చదువుతున్నారు. బీటెక్ కోర్సుల్లో 8 సెమిస్టర్లకు సంబంధించి ప్రతి సెమిస్టర్‌కు సర్టిఫికెట్ జారీ చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలో సర్టిఫికెట్ల ప్రింటింగ్ ఖర్చు ఎక్కువగా ఉండేది. ఈ నేపథ్యంలో డిజీ లాకర్ విధానాన్ని వర్సిటీ అధికారులు అందుబాటులోకి తీసుకువచ్చారు. తాజాగా సెమిస్టర్ సర్టిఫికెట్ హార్డ్‌కాపీ కాకుండా నేరుగా డిజిటల్ విధానంలోనే నేరుగా డిజీ లాకర్‌లో అందుబాటులోకి తెచ్చారు. ప్రొవిజనల్ సర్టిఫికెట్ దరఖాస్తు సమయంలో డిజీ లాకర్‌లోని డిజిటల్ సర్టిఫికెట్లు డౌన్‌లోడ్ చేసుకుని అందజేస్తే చాలు. ఈ విధానం అత్యంత పకడ్బందీగా అమలవుతుండడంతో జేఎన్‌టీయూ(ఏ) విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

లాకర్‌లో 6.70 లక్షల సర్టిఫికెట్లు..

జేఎన్‌టీయూ (ఏ)లో డిజీ లాకర్ విధానం అమల్లోకి తెచ్చి ఏడాది పూర్తయింది. ఇప్పటి వరకూ మొత్తం 6.70 లక్షల సర్టిఫికెట్లను లాకర్‌లో ఉంచారు. దీంతో ఏడాదికి 6.70 లక్షల సర్టిఫికెట్ల ముద్రణకు అయ్యే ఖర్చు వర్సిటీకి ఆదా అవుతోంది. డిజీ లాకర్ విధానంతో ఎప్పటికప్పుడు సర్టిఫికెట్లు డౌన్‌లోడ్ చేసుకునే అవకాశంతో పాటు తిరిగి అందులోనే భద్రపరచుకోవచ్చు. ఉద్యోగ అవకాశాలు కల్పించే కంపెనీలు సైతం అభ్యర్థుల సర్టిఫికెట్లు ఒరిజినల్ అవునా? కాదా? అనే అంశాన్ని నేరుగా డిజీ లాకర్‌లోనే పరిశీలించుకునే వెసులుబాటూ ఉంది. గతంలో కంపెనీలు థర్డ్‌పార్టీతో పరిశీలన చేయించేవి.

ప్రొవిజనల్‌తో అవసరం లేదు



డిజీ లాకర్ విధానం విజయవంతం కావడం గర్వకారణం. డిజీ లాకర్‌లోని సర్టిఫికెట్లతో ప్రొవిజనల్, ఒరిజినల్ డిగ్రీ (ఓడీ) తీసుకోవచ్చు. కానీ ఎక్కువ మంది విద్యార్థులు ఒరిజినల్ డిగ్రీ తీసుకుని తిరిగి ప్రొవిజనల్‌కు దరఖాస్తు చేస్తున్నారు. ప్రొవిజనల్ సర్టిఫికెట్ స్వల్ప కాలం వరకు మాత్రమే చెల్లుబాటు అవుతాయి. ఒరిజినల్ డిగ్రీ తీసుకున్న వెంటనే ప్రొవిజనల్ డిగ్రీ అవసరం ఉండదు. విద్యార్థులందరూ ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. ఒరిజినల్ డిగ్రీనే అంతిమం. డిజీ లాకర్‌లో ఇప్పటికే 6.70 లక్షల సర్టిఫికెట్లు అందుబాటులోకి తెచ్చాం.

– ప్రొఫెసర్ జింకా రంగజనార్ధన, వీసీ, జేఎన్‌టీయూ (ఏ)

విశ్వ వ్యాప్తంగా పుట్టపర్తి ఆధ్యాత్మిక వెలుగులు

- సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకరరాజు



భజన మందిరాన్ని ప్రారంభిస్తున్న ఆర్‌జే రత్నాకర్, ఎమ్మెల్యే శంకరనారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ

రొద్దం: ఓ కుగ్రామమైన పుట్టపర్తిలో వెలిగిన ఆధ్యాత్మిక దీపం ప్రపంచ వ్యాప్తంగా వెలుగులు విరజిమ్ముతోందని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకరరాజు అన్నారు. రొద్దంలోని పెన్నానది ఒడ్డున నూతనంగా నిర్మించిన పర్తిసాయి సేవాసదన్ భజన మందిరాన్ని బుధవారం స్థానిక ఎమ్మెల్యే ఎం.శంకరనారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ సమక్షంలో ఆయన ప్రారంభించి, మాట్లాడారు. సత్యసాయి ఆశయాలకు అనుగుణంగా ప్రపంచ వ్యాప్తంగా 150 దేశాల్లో విస్తృత సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. దేశంలోని 25 రాష్ట్రాలు, 500 జిల్లాల్లో సత్యసాయి సంస్థలు అమోఘంగా పనిచేస్తున్నాయన్నారు. అనంతరం అమృత దర్శినిలో భాగంగా విదేశీ భక్తులు 400 మంది నిరుపేదలకు ఒక నెలకు సరిపడ నిత్యావసర సరుకులు అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు కేటీ శ్రీధరరెడ్డి, సేవా సమితి సభ్యులు ఆర్‌ఏ రవిశేఖర్‌రెడ్డి, ఓబులేసు, సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు రఘుపాత్రుని లక్ష్మణ్, జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణమూర్తి, మండల సత్యసాయి సేవాసమితి కన్వీనర్ అంజినరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

పావగడ: తాలూకాలోని వేర్వేరు ప్రాంతాల్లో చోటు చేసుకున్న ప్రమాదాల్లో ఇద్దరు అకాల మృత్యువాత పడ్డారు. వీరిలో ఒకరు పాముకాటుతో మృతి చెందారు. పోలీసులు తెలిపిన మేరకు.. పావగడ తాలూకా చెన్నమరెడ్డిపల్లికి చెందిన మల్లక్క (70) కొన్ని రోజుల క్రితం అప్పాజిపల్లిలోని బంధువుల ఇంటికి వెళ్లింది. మంగళవారం రాత్రి తోటలోని ఇంటిలో నిద్రిస్తుండగా పాము కాటుకు గురైన ఆమెను కుటుంబసభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక ఆమె మృతిచెందింది. అలాగే అయ్యవారిపల్లిలోట ఓ పాత గోడకు సిమెంట్ ప్లాస్టింగ్ చేస్తున్న సమయంలో గోడ కూలింది. ఘటనలో బేల్దారి నారాయణప్ప (42) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య దేవి, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మహా యజ్ఞానికి తరలిరండి

- ఎండోమెంట్ ఏసీ రామాంజనేయులు

అనంతపురం కల్చరల్: దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి 17వ తేదీ వరకూ విజయవాడలోని ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం వేదికగా జరిగే అష్టోత్తర శత కుండాత్మక మహాయజ్ఞంలో పాల్గొనాలంటూ జిల్లా వాసులకు ఆ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామాంజనేయులు పిలుపునిచ్చారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత మహాయజ్ఞ యాగాదులను ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యజ్ఞ సంకల్పం, దేవదాయశాఖమంత్రి కొట్టు సత్యనారాయణ యజ్ఞదీక్షాధారణ చేస్తారన్నారు. రోజూ ఉదయం హోమాలు, సాయంత్రం రోజుకొక దేవతామూర్తుల కల్యాణోత్సవంతో ఆధ్యాత్మిక పరంపర కొనసాగుతుందన్నారు.

యువకుడి బలవన్మరణం



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

సోమందేపల్లి: జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... సోమందేపల్లి మండలం చల్లాపల్లికి చెందిన నర్సప్ప కుమారుడు శివ (25) బెంగళూరులో కూలి పనులతో జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. చికిత్స చేయించినా జబ్బు నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం అర్ధరాత్రి ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం తెల్లవారుజామున ఈ విషయాన్ని గమనించిన కుటుంబసభ్యుల సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ..

శివ ఆత్మహత్య విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ బుధవారం చల్లాపల్లికి చేరుకుని బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆ గ్రామ ఎంపీటీసీ సభ్యుడు ఆంజనేయులుకు శివ స్వయాన అన్న కుమారుడు. ఆత్మహత్యకు కారణాలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. శివ మృతదేహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన వెంట వైఎస్సార్ సీపీ మాజీ కన్వీనర్ వెంకటరత్నం, స్థానిక నాయకులు ఈశ్వర్, దాము, బాబిరెడ్డి, యల్లారెడ్డి ఉన్నారు.

వైభవంగా పట్టపు దేవర



సామూహిక వడిబాల కార్యక్రమంలో పాల్గొన్న జంటలు



బీరప్ప దేవుళ్లను దర్శించుకుంటున్న భక్తులు

బొమ్మనహాళ్/బెళుగుప్ప: మండల కేంద్రంలోని జగద్గురు రేవణ సిద్దేశ్వర మహా ప్రాంగణంలో రాజగిరి గోత్ర కురబ సోదరుల ఆధ్వర్యంలో బీరప్ప దేవుళ్ల పట్టపు దేవర మహోత్సవం బుధవారం నేత్రపర్వంగా సాగింది. జల కలశాలకు విశేష పూజలు నిర్వహించి, మహాజన సంప్రోక్షణగావించి, గొరవయ్యల అమృతపానోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. అనంతరం వేదపండితులు మదనమోహన్‌శాస్త్రి, రాంబాబుశాస్త్రి మంత్రోచ్ఛరణలతో కురుబల ప్రాంతీయ కులగురువు మృత్యుంజయ వడయార్, జాలోడు, బళ్లారి, కర్తపర్తి, చాబాల వడయార్ల ఆశీర్వచనాలతో మహాసామ్రాజ్య పట్టాభిషేకం, పుణ్యదంపతుల వస్త్ర సమర్పణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా 400 జంటలకు సామూహిక వడిబాల కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం ఆహ్వానిత బీరప్ప దేవుళ్లకు బండారు సమర్పించారు. అనంతరం తొమ్మిది మంది దేవుళ్లను పురవీధుల్లో ఊరేగించారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కామక్క కథ నాటికను ప్రదర్శించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగున ఉన్న కర్ణాటక నుంచి దాదాపు 12 వేల మంది భక్తులు తరలిరావడంతో బెళుగుప్ప జనసంద్రమైంది. భక్తులకు బెళుగుప్ప ఆగలూరేశ్వరస్వామి నిర్వాహక సేవాకమిటీ అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాల్లో కులగురువులతో పాటు ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి తనయుడు వై.భీమిరెడ్డి పాల్గొన్నారు.

ప్రసన్న వేంకటరమణుడి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



కంకణధారణ చేస్తున్న దృశ్యం (చిత్రంలో) శ్రీవారితో కల్యాణం జరిగే తొమ్మిదేళ్ల బాలిక వైశాలి

రాయదుర్గం టౌన్: పట్టణంలోని కోటలో వెలసిన ప్రసన్న వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలకు బుధవారం అంకురార్పణ జరిగింది. తొలి రోజు బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కలశస్థాపన, స్వస్తివాచనము, రక్షాబంధనము నిర్వహించారు. సాయంత్రం పట్టణంలోని శ్రీమార్కండేయస్వామి ఆలయంలో కంకణధారణ జరిగింది. వందేళ్లుగా వస్తున్న విశిష్ట సంప్రదాయంలో భాగంగా ఈ నెల 8న శ్రీవారి కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా శ్రీవారితో కల్యాణం జరిగే తొమ్మిదేళ్ల బాలికతో నిశ్చితార్థం (కంకణధారణ) కార్యక్రమాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. శ్రీవారి తరఫున బ్రాహ్మణులు, పుర పెద్దలు, దేవదాయశాఖ అధికారులు, వధువు తరఫున బాలిక తల్లిదండ్రులు, బంధువులు, పద్మశాలీయ కులస్తులు హాజరై తాంబులాలు ఇచ్చిపుచ్చుకున్నారు. కార్యక్రమంలో ఈడిగ నరసింహారెడ్డి, ఆలయ పాలక మండలి చైర్మన్ పాలాక్షిరెడ్డి, పద్మశాలీయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అరవ శివప్ప తదితరులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం ధ్వజారోహణ, శ్రీవారి సింహవాహనోత్సవం నిర్వహించనున్నారు.

బైక్, ఆటో ఢీ

- ఐదుగురికి గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమం



గాయపడిన అల్లాబకాష్



అపస్మారక స్థితికి చేరుకున్న పుష్ప

పుట్టపర్తి అర్బన్: ఆటోను ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఐదుగురు గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు తెలిపిన మేరకు... పుట్టపర్తి మండలం బత్తలపల్లికి చెందిన నారాయణస్వామి నాయక్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం పెడపల్లిలో ప్రయాణికులను ఎక్కించుకుని కొత్తచెరువుకు బయలుదేరాడు. బత్తలపల్లి శివారులో ఉన్న గంటల మారెమ్మ ఆలయం వద్దకు చేరుకోగానే గోరంట్ల మండలం గంగపల్లి నివాసి అల్లాబకాష్ మద్యం మత్తులో ద్విచక్ర వాహనాన్ని వేగంగా నడుపుతూ నేరుగా వెళ్లి ఆటోను ఢీకొన్నాడు. ప్రమాదాన్ని ముందే పసిగట్టిన ఆటో డ్రైవర్ నారాయణస్వామి నాయక్ సడన్ బ్రేక్ వేయడంతో వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదానికి కారణమైన అల్లాబకాష్‌కు తలకు తీవ్రగాయమైంది. ఆటోలో ప్రయాణిస్తున్న పెడపల్లి నివాసి పుష్ప తలకు, ఛాతీపై బలమైన గాయాలు కావడంతో ఆమె అపస్మారక స్థితికి చేరుకుంది. అదే ఆటోలో ప్రయాణిస్తున్న కొట్లపల్లి నివాసులు మరో ముగ్గురు గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న అల్లాబకాష్, పుష్పను అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పుట్టపర్తి రూరల్ ఎస్‌ఐ దాదాపీర్ తెలిపారు.

నీటి కుంటలో చిక్కుకుని యువకుడి మృతి



మృతుడు గౌస్‌బాషా

కదిరి టౌన్: మద్యం మత్తులో నీటి కుంటలో చిక్కుకుని ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కదిరిలోని కంచుకోట ప్రాంతానికి చెందిన అస్లాంబాషా కుమారుడు గౌస్‌బాషా (35) సెంట్రింగ్ పనులతో జీవనం సాగించేవాడు. బుధవారం మధ్యాహ్నం స్నేహితులతో కలసి ఫుల్‌గా మద్యం సేవించాడు. అనంతరం ఎండ వేడిమికి తాళలేక గరుడ తీర్థం (నీటి కుంట)లోకి దిగాడు. ఎంత సేపటికీ గౌస్‌బాషా బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన స్నేహితులు అక్కడకెళ్లి పరిశీలించారు. నీటి కుంటలో చిక్కుకున్న గౌస్‌బాషాను వెలికి తీసి కదిరి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

బరిలో 22 మంది

- తపాలా శాఖ సహకార సంఘం ఎన్నికల్లో ముగిసిన నామినేషన్ల ఘట్టం



అనంతపురం సిటీ: తపాలా ఉద్యోగుల సహకార సంఘం ఎన్నికల పోరు ప్రతిష్టాత్మకంగా మారింది. కరోనా విపత్కర పరిస్థితుల నేపథ్యంలో ఐదేళ్ల తర్వాత తొలిసారిగా జరుగుతున్న ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం బుధవారం ముగిసింది. మొత్తం 11 డైరెక్టర్ స్థానాలకు 30 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా.. ఎనిమిది మంది తమ నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. దీంతో 22 మంది అభ్యర్థులు బరిలో ఉన్నట్లు ఎన్నికల అధికారి కుమార్ ప్రకటించారు. వీరి పేరులోని తెలుగు అక్షరమాల ఆధారంగా ప్రాధాన్యత క్రమంలో గుర్తులు కేటాయించారు.

రెగ్యులర్ ఉద్యోగుల స్థానాలకు 18 మంది..

మొత్తం 11 స్థానాల్లో తొమ్మిది స్థానాలు(డైరెక్టర్ పోస్టులు) రెగ్యులర్ ఉద్యోగులకు కేటాయించారు. ఈ కోటా కింద 24 మంది నామినేషన్లు దాఖలు చేయగా వారిలో ఆరుగురు నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. 18 మంది పోటీలో నిలిచారు. వీరిలో ఆర్వీ రామ్మోహన్‌గుప్త (బీరువా), ఎ.విశ్వనాథరెడ్డి (గాలి బుడగ), ఎస్కే మహేష్ గౌడ్(వంకాయ), అందాల నాగేశ్వర(బకెట్), కావలి పెద్దన్న(బల్ల), కురవ స్టాలిన్ బాబు(బంతి), కె.గణేనాయక్(అరటి పండు), కె.రాఘవేంద్ర ప్రసాద్(బుట్ట), గస్తీ రమేష్‌గౌడ్(బ్యాట్), చిన్నమాదల కిశోర్ కుమార్(బాట్స్‌మెన్), జె.శివకుమార్(బ్యాటరీ లైట్), దేవగుడి కిరణ్‌కుమార్(నల్లబోర్డు), ఎస్ఆర్‌కే ప్రసాద్(బ్రెడ్), పెండ్యాల విశ్వనాథ్(పెట్టె), బి.నరేంద్రనాథ్‌రెడ్డి(బ్రష్), బి.నవీన్‌కుమార్(కేక్), బి.మంజునాథ్(కెమెరా), బి.హర్షవర్ధన్‌రెడ్డి(కొవ్వొత్తి) ఉన్నారు.

ఆ రెండు స్థానాలకు నలుగురు..

బీడీఎస్ ఉద్యోగుల కోసం కేటాయించిన రెండు స్థానాలకు మొత్తం ఆరు నామినేషన్లు దాఖలు కాగా, ఇద్దరు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. బరిలో నిలిచిన నలుగురిలో కె.సూర్యనారాయణరెడ్డికి క్యారెట్ గుర్తు, జె.వెంకటరామిరెడ్డికి కోటు), బి.నాగభూషణంకు కొబ్బరికాయ, మంత్రి ఆనంద్‌కు దువ్వెన గుర్తులు కేటాయించారు.

609 మందికి ఓటు హక్కు..

తపాలా శాఖలో పని చేస్తూ సహకార సంఘంలో సభ్యత్వం కలిగిన వారు మొత్తం 792 మంది ఉన్నారు. అయితే వీరిలో 609 మందికి మాత్రమే ఓటు హక్కు ఉంది. మిగిలిన 183 మందిని అనర్హులుగా ప్రకటించినట్లు ఎన్నికల అధికారి కుమార్ తెలిపారు. సొసైటీలో రుణాలు తీసుకొని వరుసగా మూడు కంతులు కట్టని వారిని అనర్హులుగా పరిగణించినట్లు వివరించారు.